క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నాయకుడికి పీఆర్కే పరామర్శ



కారెంపూడి: కారెంపూడి ఎంపీపీ మేకల శారద భర్త వైఎస్సార్ సీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డిని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) పరామర్శించారు. శ్వాసకోశ సంబంధమైన శస్త్రచికిత్స చేయించుకున్న ఆయన్ను ఆదివారం సాయంత్రం హైదరాబాదులో పీఆర్కే పరామర్శించారు. యశోద హాస్పిటల్‌కు పీఆర్కే వెళ్లి ఆయనను కుటుంబ సభ్యులను పరామర్శించి శ్రీనివాసరెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పీఆర్కే ఆర్థిక సాయం

మాచర్ల: మండల పరిధిలోని భైరవునిపాడులో అనారోగ్యంతో బాధపడుతున్న ఆలేటి సత్యం కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోమవారం పరామర్శించారు. రూ.10వేలు ఆర్థిక సాయం అందజేసి ధైర్యం చెప్పారు. ఆయనతోపాటు పార్టీ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

క్రీడలు మానసిక దృఢత్వాన్ని కలుగచేస్తాయి



మాచర్ల రూరల్: క్రీడలు విద్యార్థులకు మానసిక దృఢత్వంతో పాటు, స్నేహపూరిత వాతావరణాన్ని కలుగచేస్తాయని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో అండర్– 19 ఇంటర్నేషనల్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతకు బహుమతి ప్రదానం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలో నాలుగు జిల్లాలకు సంబంధించి క్రికెట్ పోటీలను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కళాశాల యాజమాన్యం కృషి అభినందనీయం అన్నారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి రూ.25 వేలు వినుకొండ కృష్ణవేణి జూనియర్ కాలేజీ, రెండో బహుమతి రూ.20 వేలు సోషల్ వెల్ఫేర్ స్కూల్ అచ్చంపేట, మూడో బహుమతి 15 వేలు గవర్నమెంట్ జూనియర్ కాలేజీ(విజయపురిసౌత్)లకు చెందిన విద్యార్థులు సొంతం చేసుకున్నట్లు కళాశాల కరస్పాండెంట్ జున్నశ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్ రెడ్డి పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన పుష్పలత



పిడుగురాళ్ల: జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థిని ఎస్.పుష్పలత ఎంపికైనట్లు డైరెక్టర్ బొల్లా గిరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్తెనపల్లిలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాలబాలికల జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపినట్లు చెప్పారు. ఈ నెల 22వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న పోటీల్లో పుష్పలత పాల్గొంటారని వివరించారు. పుష్పలతను కళాశాల ప్రిన్సిపాల్ పి.నరేష్, డైరెక్టర్ బొల్లా గిరిబాబు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

స్మార్ట్ కార్డుల పంపిణీ

మాచర్ల రూరల్: స్మార్ట్ కార్డులను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి సోమవారం పంపిణీ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ కార్డులతో ప్రయోజనాలు ఉంటాయని, ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో గురజాల ఆర్డీఓ మురళీకృష్ణ, తహసీల్దార్ వి.కిరణ్ కుమార్, టీడీపీ నాయకులు రాజ బోయినమధు, పోలూరి నరసింహారావు, కొమర దుర్గారావు, డెప్యూటీ తహసీల్దార్లు షేక్ బాషా, బత్తుల వాణి, ఆర్ఐ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి



కారెంపూడి: పంట వేసిన ప్రతి ఎకరాను ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి పి.నరసింహారావు కోరారు. కారెంపూడిలో వ్యవసాయ సహాయకులు చేస్తున్న పంట నమోదును ఏఓ సోమవారం పరిశీలించారు. ఇప్పటి వరకు 14,000 ఎకరాలను ఈ క్రాప్‌లో నమోదు చేయడం జరిగిందన్నారు. మిగతా సాగు విస్తీర్ణం కూడా నమోదు చేయించుకోవాలని ఏఓ రైతులను కోరారు. గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలో కాని, గ్రామ వ్యవసాయ సహాయకులను కాని సంప్రదించి పంట నమోదు చేయించుకోవాలని కోరారు. పంట నమోదు కాకుంటే పంటలు మద్దతు ధరకు అమ్ముకోడానికి అలాగే పంట నష్టం జరిగినా పరిహారం అందడానికి వీలుండదని వివరించారు.

సమస్యలు పరిష్కరించాలని

విద్యుత్ ఉద్యోగుల నిరసన



పిడుగురాళ్లలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు



రెంటచింతలలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

రెంటచింతల: విద్యుత్ రంగ సంస్థలలో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో సెక్షన్ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగదు రహిత వైద్యం అందించాలని, 1999 ఫిబ్రవరి ఒకటి నుంచి 2004 ఆగస్టు 31 మధ్య చేరిన ఉద్యోగులకు పెన్షన్ సదుపాయం కల్పించాలని, దళారీ వ్యవస్థను రద్దు చేసి కార్మికులకు నేరుగా వేతనాలు చెల్లించాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులు(కార్మికులు) సంబంధించిన 6 డిమాండ్లతో పాటు మొత్తం 13 రకాల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఈ ఆందోళన కార్యమాలను చేపట్టినట్లు తెలిపారు. 15,16 తేదీలలో నల్ల బ్యాడ్జీలను ధరించి విధులు నిర్వహించడం, 17, 18 తేదీలలో భోజన విరమ సమయాలలో ఆందోళనలు చేపట్టడం, 19, 20 తేదీలలో రిలే నిరాహార దీక్షలు చేపట్టి 22వ తేదీన ఉద్యోగులంతా భారీ ర్యాలీగా వెళ్లి జిల్లా కలెక్టర్‌కు మెమొరాండం సమర్పించే విధంగా ఏపీ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగులు ఎస్.శ్రీనివాసచారి, ఎస్.వెంకటేశ్వర్లు, టి.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు, వి. సుదర్శన్ పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

పిడుగురాళ్లరూరల్: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని విద్యుత్ జేఏసీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని బ్రాహ్మణపల్లి సబ్ స్టేషన్‌లో కాంట్రాక్ట్ కార్మికులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ తరహాలో సంస్థలో విలీనం చేయాలని, 2022 పీఆర్‌సీ బకాయిలు వెంటనే చెల్లించాలని, పదేళ్ల సర్వీసు దాటిన కార్మికులకు 2018లో మంజూరు చేసిన సర్వీస్ ఎయిన్స్‌టీన్‌ను పునరుద్ధరించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు.

కుటుంబాన్ని పరామర్శించిన విద్యుత్ శాఖ అధికారులు

సాక్షి ఎఫెక్ట్



సాగర్‌బాబును పరామర్శిస్తున్న ఏడీఈ వీరేశ్వరరావు, ఏఈఈ పెద మస్తాన్

కారెంపూడి: విద్యుత్ కార్మికుని కుటుంబాన్ని ఆదుకోవాలని సోమవారం సాక్షిలో వచ్చిన వార్తపై విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు బాధిత కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. గురజాల ఏడీఈ టి.వీరేశ్వరరావు, కారెంపూడి ఏఈఈ కె.పెద మస్తాన్, వర్ల సాగర్‌బాబును పరామర్శించారు. స్వగ్రామం మండలంలోని కాకానివారిపాలెంలో ఇళ్ల గడవక అత్తగారిల్లు చేజర్లలో ఉంటూ తనను ఆదుకోవాలని పేదరికంలో ఉన్నానని అభ్యర్థిస్తూ ఇంట్లోనే రిలే నిరాహారదీక్ష చేస్తున్న సాగర్‌బాబును అధికారులు పరామర్శించారు. ప్రమాదం జరిగినప్పుడు గ్రామస్తులు, విద్యుత్ శాఖ ఉద్యోగులు చందాలు వేసుకుని ఆర్థిక సాయం చేశారని ఆ డబ్బుతో ఇప్పటి వరకు హాస్పిటల్స్‌లో వైద్యం చేయించారని అధికారులకు సాగర్‌బాబు వివరించారు. అయితే వైద్యం వల్ల వెన్నుపూస నడుము కాని కాళ్లలో కాని ఎలాంటి కదలికలు లేవని ఏ పని చేసుకోవాలన్నా ఇతరులపై ఆధారపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఆర్థిక సాయంతో పాటు ప్రభుత్వ పరంగా ఏదైనా సాయం అందించి ఆదుకోవాలని అభ్యర్థించాడు, భార్య, ఇద్దరు పిల్లల పోషణ బాధ్యత తనపైనే ఉందని ఇప్పుడు తాను పని చేయలేకపోయేసరికి తన భార్య కూలీ పనులు చేసి మమ్మల్ని పోషిస్తోందని అది ఆమెకు శక్తికి మించిన పని అయిందని వివరించాడు. ఇటు వైద్య ఖర్చులకు డబ్బు లేదని తాను కుర్చీకి మంచానికే పరిమితం అయ్యాయని అధికారులకు వివరించారు. అధికారులు ప్రభుత్వపరంగా సాయం అందించేందుకు కృషి చేస్తామని సాగర్ బాబుకు హామీ ఇచ్చారు.

‘ఉపాధి’ లక్ష్యాలను చేరుకోవాలి

డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి



బెల్లంకొండలో రికార్డులను పరిశీలిస్తున్న పీడీ సిద్ధలింగమూర్తి

బెల్లంకొండ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యాలను మండలంలో నూరు శాతం చేరుకోవాలని డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాల ఉపాధి హామీ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో అందరికీ వందరోజుల ఉపాధి పని కల్పించాలన్నారు. ఇంకుడు గుంతల ఏర్పాటు, నీటి తొట్టెల నిర్మాణాలపై గ్రామాల వారీగా చర్చించారు. పండ్ల తోటల పెంపకం పై గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. అనంతరం మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్‌పై అందిన ఫిర్యాదులపై విచారణ చేశారు. గ్రామానికి సంబంధించి అన్ని రికార్డులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. గ్రామానికి చెందిన పలువురు నాయకులు రిజర్వేషన్ ప్రకారం ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టును ఎస్సీలకు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీడీ నారాయణ, ఎంపీడీవో పి.సునీత, సూపరింటెండెంట్ శ్రీనివాస్ నాయక్, నేతలు గుంజ గంగారావు, కొడవటి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి



సత్కారం అందుకున్న కరాటే విజేతలు, గురువు రామయ్య

సత్తెనపల్లి: చిన్నతనం నుంచే చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించి ప్రయోజకులు కావాలని సీపీఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు గద్దె చలమయ్య ఆకాంక్షించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన చిన్నారులు సౌత్ ఇండియా కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్, కాంస్య పతకాలు సాధించిన విజేతలకు పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన నిర్వహించిన అభినందన సభలో సోమవారం సత్కరించి, మెమొంటోలు, ప్రశంసాపత్రాలు అందించారు. సభకు న్యాయవాది పిన్నమనేని పాములయ్య అధ్యక్షత వహించారు. చలమయ్య మాట్లాడుతూ కరాటేలో సత్తెనపల్లికి చెందిన లగుమవరపు కిరీటి, లగుమవరపు గేస్సు ఆశిత్, మల్లాల వెంకట బాలాజీ, బొల్లేపల్లి టిషన్త్, బూతుకూరి అక్షయ రెడ్డి గోల్డ్ మెడల్ సాధించగా బిట్రా సత్యనారాయణ కాంస్య పతకాలు సాధించి సత్తెనపల్లికే వన్నె తెచ్చారన్నారు. వీరికి శిక్షణ ఇచ్చి విజేతలుగా నిలిపిన బ్లాక్ బెల్ట్ ఫిఫ్త్ డాన్ అనుముల రామయ్యను సన్మానించారు. ఈ సందర్భంగా ఉషోదయ కళాపరిషత్ అధ్యక్షుడు పిన్నమనేని పాములయ్య రచించిన సన్మాన పత్రాన్ని రామయ్యకు సమర్పించారు. ఈ సభలో రామయ్య గురువు, ఆయన సోదరుడు సీనియర్ కరాటే మాస్టర్ రాంబాబును సన్మానించారు.

దేశవ్యాప్తంగా ఇనుమడింపజేశారు

ఇంటర్నేషనల్ పవర్ లిఫ్ట్ గోల్డ్ మెడలిస్ట్ పసుపులేటి సురేష్, చేనేత కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి అనుముల వీర బ్రహ్మం, పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం కన్వీనర్ పొట్టి సూర్యప్రకాశరావు, నరసరావుపేట పల్నాడు విజ్ఞాన కేంద్రం కన్వీనర్ అనుముల లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో సత్తెనపల్లి ప్రతిష్టను దేశవ్యాప్తంగా ఇనుమడింపజేసిన ఘనత వీరికి దక్కిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి పెండ్యాల మహేష్, సీపీఎం పట్టణ కార్యదర్శి డి.విమల, ఐద్వా పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రజిని, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీకి భూములిచ్చిన రైతుల పిల్లలకు ఉద్యోగాలివ్వాలి

కారెంపూడి: మండలంలోని ఇనుపరాజుపల్లె సమీపంలోని శ్రీ సిమెంట్ యాజమాన్యంపై కాచవరం, ఇనుపరాజుపల్లె గ్రామస్తులు గురజాల ఆర్డీఓ మురళీకృష్ణ, కారెంపూడి తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఫ్యాక్టరీ నిర్మాణానికి భూములు సేకరించే సమయంలో భూములిచ్చిన రైతుల పిల్లల్లో అర్హులుంటే ఉద్యోగ అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చి రెండేళ్లు అయినా హామీని నిలుపుకోలేదని పేర్కొన్నారు. పైగా కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న వారిని తప్పించి ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను రప్పించుకుని పని చేయించుకుంటున్నారని ఆరోపించారు. ఫ్యాక్టరీకి రెండు గ్రామాల ప్రజలు 1,100 ఎకరాలు భూములిచ్చారని ఫ్యాక్టరీ యాజమాన్యం గుర్తించి అర్హత ఉన్న యువకులకు ఉద్యోగాలివ్వాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు గోళ్ల సురేష్ యాదవ్, నున్నా జనార్దన్ పాల్గొన్నారు.

రేపటి నుంచి బీజేపీ సేవా కార్యక్రమాలు

రెంటచింతల: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 నిర్వహించనున్న బీజేపీ సేవా కార్యక్రమాల కార్యాచరణ రూపొందించినట్లు మాచర్ల నియోజకవర్గ బీజేపీ నాయకుడు పోకూరి కాశీపతి తెలిపారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం నిర్వహించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షులు బోయ నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.చెన్నకేశవులు, నాయకులు ఏ గోవర్ధనాచారి, పెనుగొండ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీ పరీక్షలు

బొల్లాపల్లి: జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి వారధి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పోటీ పరీక్ష సోమవారం నిర్వహించారు. జెడ్పీ హైస్కూల్, మోడల్ స్కూల్, కేజీబీవీలకు చెందిన విద్యార్థులు వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించారు. ఆయా పాఠశాలలో 8, 9, 10 తరగతులకు చెందిన సుమారు 30 మందికి పైగా విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వ్యాసరచనకు సంబంధించి చదువు ప్రాముఖ్యత, డిబేట్‌కు సంబంధించి శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యంలో దేనికి ప్రాధాన్యత పై పోటీ పరీక్షలు నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారి–2 వివరించారు. వ్యాసరచన పోటీల్లో జడ్పీ హైస్కూల్ బండ్లమోటుకు చెందిన 8,9,10, తరగతుల విద్యార్థులు వ్యాసరచనలో సువర్ణ జ్యోతి, దేవేంద్ర నాయక్, శ్రీనివాసరావు, డిబేట్‌లో కేజీబీవీకి చెందిన డి.చంద్రకళ, బి.తులసి భార్గవి బాయి, వి.ప్రమీల బాయిలు ప్రథమ స్థానంలో గెలుపొందినట్లు విద్యాశాఖ అధికారి–2 తెలిపారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లి రూరల్: జాతీయ పోషకాహార వారోత్సవాల్లో భాగంగా తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ విద్యార్థులు తాడేపల్లి రూరల్‌లోని మెల్లంపూడిలో అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యకరమైన జీవితం గడపవచ్చని వివరించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఇంటింటికి వెళ్లి పోషకాహారం తీసుకోవడం వలన కలిగే లాభాలను, ప్రాముఖ్యతను వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీకాంత్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి. జోనితిన్, ఫీల్డ్ కో ఆర్డినేటర్ పి. సురేష్, వలంటీర్లను వర్సిటీ వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్ తదితరులు అభినందించారు.

కళాకారుడు రవికుమార్‌కు జాతీయ పురస్కారాలు



పురస్కారం అందుకుంటున్న వర్ధమాన పౌరాణిక కళాకారుడు బెజగం రవికుమార్

సత్తెనపల్లి: హైదరాబాద్ శారద మ్యూజిక్ అకాడమీ ఆర్ట్ ఆఫ్ లెర్నింగ్ బ్యాచ్ ఆధ్వర్యాన ఈ నెల 13న జరిగిన తెలుగు కీర్తి కిరీటాలు–2025 అంతర్ పురస్కారాల్లో భాగంగా పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన వర్ధమాన పౌరాణిక కళాకారుడు బెజగం రవికుమార్‌కు విశిష్ట జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేశారు. రవికుమార్ పౌరాణిక కళా రంగంలో పదేళ్లుగా వివిధ విభిన్న, వైవిధ్య, పౌరాణిక, చారిత్రక, సాంఘిక పాత్రల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రదర్శనలు చేసినందుకు తెలుగు కీర్తి కిరీటాలు పౌరాణిక నట చక్రవర్తి పురస్కారం ప్రదానం చేశారు. రవికుమార్‌కు శాలువా కప్పి ప్రశంసాపత్రంతో పురస్కారం ప్రదానం చేసి ప్రత్యేకంగా అభినందించారు. విశ్వకర్మ హుస్నాబాద్ సిద్దిపేట వారి విశ్వకళాభూషణ్ జాతీయ గౌరవ పురస్కారాన్ని ఈనెల 14న అందించారు. రవికుమార్‌ను సత్తెనపల్లిలోని వివిధ కళాపరిషత్‌ల అధ్యక్షులు, కార్యదర్శులు, మిత్రులు ప్రత్యేకంగా సోమవారం అభినందించారు.

22న హైదరాబాద్‌లో వర్గీకరణ సభ



కావల్యాపురం: తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ కోసం కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి కోసం ఈనెల 22న చేపట్టిన కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి కోట సుబ్బు మాదిగ పిలుపు నిచ్చారు. సోమవారం మండల కేంద్రం కావల్యాపురంలో ఎమ్మార్పీఎస్ మండల స్థాయి నూతన అధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ భారతదేశంలో తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ చట్టం చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. హైదరాబాదు నగరంలో రవీంద్ర భారతిలో జరగనున్న ఈ సదస్సులో అందరు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఎమ్మార్పీఎస్ నూతన మండల అధ్యక్షులుగా కలుపుకూరి ప్రవీణ్ కుమార్ మాదిగను ఏకగ్రీవంగా ఏన్నుకున్నారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. నియోజకవర్గ అధ్యక్షులు కలుపుకూరి ఏసురత్నం మాదిగ, గోళ్ళ సుధాకర్ మాదిగ పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు క్రోసూరు క్రీడాకారుడు



శివగోపీకృష్ణ

క్రోసూరు: సత్తెనపల్లిలోని అమరావతి హైస్కూల్‌లో ఆదివారం జరిగిన అండర్ 20 విభాగం కబడ్డీ పోటీల్లో క్రోసూరు మోడల్ స్కూల్ క్రీడాకారుడు ఎస్. శివగోపీకృష్ణ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు మోడల్ స్కూల్ కం కాలేజి ప్రిన్సిపాల్ మేరీ సూజన్ సోమవారం తెలిపారు. పాఠశాల నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుడు, క్రీడా ఉపాధ్యాయుడు సీహెచ్ నరసింహారావు తదితరులు అభినందించారు.

● యూరియా కోసం పడిగాపులు



యూరియా కోసం అన్నదాతలు పడిగాపులు పడుతున్నారు. ఎరువులు దక్కించుకోవడానికి రైతన్న పాట్లు పడుతున్నాడు. ఎన్నిపాట్లు పడినా యూరియా దక్కించుకోలేక అన్నదాతలు అవస్థ పడుతున్నారు. సోమవారం నకరికల్లు, గుండ్లపల్లి, నర్సింగపాడు, త్రిపురాపురం, చల్లగుండ్ల, చీమలమర్రి గ్రామాల నుంచి మన గ్రోమోర్ కేంద్రానికి పెద్దసంఖ్యలో రైతులు తరలివచ్చారు. ముందుగా స్లిప్పులు రాసే పద్ధతి కావడంతో పెద్దఎత్తున హడావుడి పడ్డారు. గంటల తరబడి వేచి ఉన్నా కేవలం 100 నుంచి 125 మంది రైతులకే యూరియా అందింది. దీంతో మధ్యాహ్నం 4గంటల వరకు ఎదురుచూసిన రైతులు నిరాశతో తిరుగుముఖం పట్టాల్సివచ్చింది. –నకరికల్లు

18న సీఐటీయూ మహాసభలు



మాట్లాడుతున్న సత్తెనపల్లి ప్రాజెక్ట్ అధ్యక్షురాలు సుజాత

సత్తెనపల్లి: అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయు) పల్నాడు జిల్లా మహాసభలు ఈ నెల 18న సత్తెనపల్లిలో జరుగుతాయని, వాటిని జయప్రదం చేయాలని సత్తెనపల్లి ప్రాజెక్ట్ అధ్యక్షురాలు సుజాత పిలుపునిచ్చారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సుజాత మాట్లాడుతూ ఐసీడీఎస్ ఏర్పడి 50 ఏళ్లు పూర్తై స్వర్ణోత్సవాలు జరుపుకొంటున్న తరుణంలోనూ ఆ రంగంలో పనిచేస్తోన్న అంగన్‌వాడీలు, హెల్పర్లు ఉద్యోగ భద్రతకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 18న జరిగే మహాసభలో అంగన్‌వాడీల సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సమావేశంలో సత్తెనపల్లి ప్రాజెక్ట్ కార్యదర్శి అహల్య, సీఐటీయూ పట్టణ కార్యదర్శి హరిపోతురాజు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ సత్తెనపల్లి ప్రాజెక్ట్ గౌరవ అధ్యక్షులు పెండ్యాల మహేష్, సెక్టార్ లీడర్లు జ్యోతి, అంజలి, చాముండేశ్వరి పాల్గొన్నారు.

కళాఉత్సవ్‌లో జెడ్పీ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

వినుకొండ: పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో జిల్లా విద్యా శిక్షణ సంస్థ బోయపాలంలో నిర్వహించిన కళా ఉత్సవ్–2025 పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు పాఠశాల హెచ్ఎం బి. శైలజ తెలిపారు. ఈ మేరకు స్థానిక పాఠశాలలో నిర్వహించిన విద్యార్థుల అభినందన సభలో ఆమె మాట్లాడుతూ నాటక విభాగంలో గిడుగు ఏకపాత్రాభినయం ప్రదర్శించిన 10వ తరగతి విద్యార్థినీ శ్రీలక్ష్మికి ఉమ్మడి గుంటూరు జిల్లాస్థాయిలో 3వ బహుమతి లభించిందని, శాస్త్రీయ నృత్యం, చిత్రలేఖనం, జానపద నృత్యంలో విద్యార్థులు పాల్గొని ప్రశంసలు పొందారన్నారు. విద్యార్థులకు గైడ్ ఉపాధ్యాయినిగా డాక్టర్ వి.పద్మ వ్యవహరించారు.

ఏజీకేఎం వాకర్స్, హెల్త్ క్లబ్ అధ్యక్షుడిగా కాపుగంటి



కాపుగంటి శ్రీవెంకటరత్నం



ఉడుముల వెంగళరెడ్డి

సత్తెనపల్లి: ఏజీకేఎం వాకర్స్, హెల్త్ క్లబ్ సత్తెనపల్లి పట్టణ అధ్యక్షుడిగా కాపుగంటి శ్రీవెంకటరత్నం ఎన్నికయ్యారు. పట్టణంలోని అన్నం గురువమ్మ కృష్ణ మూర్తి కళాశాల ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఎన్నిక జరిగింది. చైర్మన్‌గా పుట్టి సాంబశివరావు, డిస్ట్రిక్స్ గవర్నర్–2025గా పెద్ది శివరామ్‌ప్రసాద్, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు చెలికాని సీతారామయ్య, పూర్వాధ్యక్షుడు దాసరి కోటేశ్వరరావు.. కార్యదర్శిగా ఉడుముల వెంగళరెడ్డి, కోశాధికారిగా జొన్నలగడ్డ వెంకటేశ్వరరావు(మౌర్య), ఉపాధ్యక్షులుగాపోతుగంటి రామకోటేశ్వరరావు, రావెల చంద్రశేఖర్, గొర్రెపాటి సుధాకర్, జాయింట్ సెక్రటరీలుగా శిరసాల భుజంగరావు, తెంటు బాలాజీ, ఈసీ మెంబర్లను ఎన్నుకున్నారు. 17న ప్రమాణ స్వీకారోత్సవం జరుగుతుదని సభ్యులు తెలిపారు.

దేవాలయాల పునర్నిర్మాణానికి నిధులు

బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు గ్రామంలో శ్రీ సోమేశ్వర స్వామి, వేణుగోపాలస్వామి దేవాలయాల కామన్ గుడ్ ఫండ్ లో నిధులు మంజూరయ్యాయని ఇన్చార్జి దేవదాయ శాఖ అధికారి సి.హెచ్.శివ నాగిరెడ్డి సోమవారం తెలిపారు. సోమేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి రూ 2.35 కోట్లు, వేణుగోపాల స్వామి ఆలయ పునర్మాణానికి కోటి రూపాయలు సీజీఎఫ్ నిధులు మంజూరయ్యాయని ఈవో చెప్పారు. గ్రామస్తుల సహకారంతో ఆయా దేవాలయాల పునర్మాణానికి సోమేశ్వర స్వామి, వేణుగోపాలస్వామి లకు సంబంధించి రూ 66.66 లక్షలు,రూ 30 లక్షలు చెల్లించాల్సి ఉందని త్వరలో ఆలయాల పునర్నిర్మాణం చేపడతామని ఈవో తెలియజేశారు.